# కామర్స్‌తో... కోరిన ఉద్యోగం

**మ్యాథ్స్ కొరుకుడు పడదు. సైన్స్‌పై ఆసక్తి లేదు.. అనుకునే విద్యార్థులకు కామర్స్ మంచి ప్రత్యామ్నాయం. నేడు కంపెనీల నిర్వహణలో కామర్స్ ప్రాధాన్యం పెరిగింది. దాంతో ఆయా కోర్సులు చదివినవారికి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. పది తర్వాత ఇంటర్‌లో సీఈసీ పూర్తి చేయడం ద్వారా.. సహజంగా అందుబాటులో ఉండే బీకాం, బీబీఏ, బీబీఎంలలో చేరొచ్చు. వీటి తర్వాత ఎంబీఏ చదివి సంస్థల నిర్వహణలో పాలుపంచుకునే కీలక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. మేనేజ్‌మెంట్ నిపుణులుగా ఎదగొచ్చు. మరోవైపు చార్టర్డ్ అకౌంటెంట్, ఐసీడబ్ల్యూఏ, కంపెనీ సెక్రటరీ(సీఎస్) వంటి జాబ్ గ్యారెంటీ కోర్సులు చదవొచ్చు. ఏ కంపెనీకైనా వీరి అవసరం ఉంటుంది. ఇవి కష్టమనుకుంటే.. కాదనుకుంటే.. క్లాట్ రాసి జాతీయస్థాయిలోని ప్రతిష్టాత్మక లా కాలేజీల్లో న్యాయవిద్యను అభ్యసించవచ్చు. అకౌంటింగ్ ప్యాకేజెస్.. కామర్స్ విద్యార్థుల కోసమే! దాంతోపాటు బ్యాంక్ జాబ్స్, షేర్ మార్కెట్ కొలువులు, గ్రూప్-4 వంటి ఉద్యోగాలు ఉండనే ఉన్నాయి..!! ఇలాంటి సంప్రదాయ అవకాశాలతోపాటు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, క్యాపిటల్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ ఆర్గనైజేషన్స్, ఫైనాన్షియల్ విభాగాల్లోనూ కామర్స్ అభ్యర్థులు కెరీర్‌ను సొంతం చేసుకోవచ్చు!!**

## రెగ్యులర్ డిగ్రీ... బీకాం

సీఈసీతో నేరుగా సంప్రదాయ బీకాంలో చేరిపోవచ్చు. ఇది మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ కోర్సు. పుస్తకాల ద్వారా నేర్చుకున్న అంశాలను నేరుగా విధుల్లో అన్వయించే అవకాశమున్న కోర్సు బీకాం. ఇతర డిగ్రీలతో పోల్చితే స్వయం ఉపాధి దిశగా మార్గం వేసే కోర్సు ఇది. వ్యాపార లావాదేవీలు రోజురోజుకీ విస్తృతమవుతున్న తరుణంలో.. అకౌంటింగ్ కార్యకలాపాలు తప్పనిసరవుతున్నాయి. వీటి నిర్వహణకు కామర్స్ పట్టభద్రుల అవసరం తప్పనిసరి. ప్రతి కంపెనీకి అకౌంటెంట్ ల అవసరం ఉంటుంది. కాబట్టి బీకాం పూర్తి చేసినవారికి అకౌంటెంట్ ఉద్యోగం ఖాయం. దాంతోపాటు ఇతర విభాగాల్లోనూ మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయ్. సీఈసీ పూర్తయ్యాక ఉపాధి చూసుకొని.. రెగ్యులర్‌గా కాలేజీకి వెళ్లే వీల్లేకుంటే డిస్టెన్స్‌లో బీకాం పూర్తిచేయొచ్చు. అలాంటి వారికోసం మన రాష్ట్రంలో కొన్ని యూనివర్సిటీలు డిస్టెన్స్‌లో జాబ్ మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న బీకాం కంప్యూటర్స్‌ను సైతం అందిస్తున్నాయి.

- ఆచార్య నాగార్జున వర్సిటీ – సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. బీకాం(కంప్యూటర్)ను డిస్టెన్స్ విధానంలో అందిస్తోంది.

  అర్హత: ఇంటర్, లేదా తత్సమానం.

  వెబ్‌సైట్: www.anucde.com
- ద్రవిడియన్ యూనివర్సిటీ – డైరెక్టర్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, కుప్పం (చిత్తూరు జిల్లా) కూడా దూరవిద్యా విధానంలో ఈ కోర్సును అందిస్తోంది.

  అర్హత: ఇంటర్ లేదా తత్సమానం

  వెబ్‌సైట్: ww.dravidianuniversity.ac.in

**బీబీఎం-బీబీఏ:** దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అనేకమైన యూనివర్సిటీలు ఇంటర్ అర్హతగా గ్రాడ్యుయేషన్ స్థాయిలో బీబీఎం, బీబీఏ కోర్సులను అందిస్తున్నాయి. మన రాష్ట్రంలోను పలు యూనివర్సిటీల్లో బీబీఎం అంటే.. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్. బీబీఏ అంటే.. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్. సంస్థల నిర్వహణలో కీలక పాత్ర పోషించే మేనేజ్‌మెంట్ విభాగాల్లో ... ఈ కోర్సులు పూర్తి చేసినవారి అవసరం ఎంతో ఉంటుంది. బీబీఎం, బీబీఏ పూర్తయ్యాక దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐఎంలతోపాటు వివిధ బిజినెస్ స్కూళ్లలో చేరేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్), మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్)లు రాయాలి. వీటిల్లో ర్యాంకు ఆధారంగా వివిధ బిజినెస్ స్కూళ్లలో అడ్మిషన్ లభిస్తుంది. మన రాష్ట్రంలో ఎంబీఏలో చేరేందుకు ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐసెట్) రాయాలి. ఐసెట్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది. ఐసెట్‌ను ప్రతిఏటా మేలో నిర్వహిస్తారు.


**కెరీర్ స్కోప్:** బీబీఎం, బీబీఏతోపాటు ఎంబీఏ వంటి మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసుకుంటే... మల్టీ నేషనల్ కంపెనీల్లో కలర్‌ఫుల్ కెరీర్ సొంతమవుతుంది. ఎగ్జిక్యూటివ్‌లుగా, మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా కంపెనీల్లో చేరి అనుభవం, స్కిల్స్‌తో మేనేజర్ స్థాయికి ఎదగొచ్చు.

**అకౌంటింగ్ ప్యాకేజీలు/కంప్యూటర్ కోర్సులు:** సీఈసీ, ఎంఈసీ గ్రూపులతో ఇంటర్ పూర్తి చేసి బీకాంలో చేరాలనుకుంటే అకౌంటింగ్‌కు సంబంధించి వివిధ కంప్యూటర్ అకౌంటింగ్ ప్యాకేజీలను షార్ట్‌టర్మ్ కోర్సులుగా నేర్చుకోవచ్చు. డిగ్రీతో పాటు ట్యాలీ, వింగ్స్, ఫోకస్.. కోర్సులు నేర్చుకుంటే ఉద్యోగ వేటలో అదనపు అర్హతలుగా ఉపయోగపడతాయి.

# కామర్స్‌తో జాబ్స్

## అకౌంటెంట్

బీకాం పూర్తి చేసిన విద్యార్థులకు చక్కని ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఇంగ్లీష్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న అభ్యర్థులకు పలు కంపెనీలు ఎర్ర తివాచీ పరుస్తున్నాయి. నేడు అనేక మల్టీనేషనల్ కంపెనీలు, బ్యాంకులు మన దేశంలో తమ బ్రాంచిలను ఏర్పాటు చేసి కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. వీటిల్లో ఎంట్రీ లెవల్ ఎగ్జిక్యూటివ్‌గా చేరొచ్చు. వివిధ కంపెనీల్లో అకౌంటెంట్‌గానూ చేరొచ్చు. ప్రారంభ జీతం నెలకు రూ. 15,000-20,000 వరకు ఉంటుంది. అనుభవం, స్కిల్‌తో ఎగ్జిక్యూటివ్‌లుగా ఎదగొచ్చు. మంచి జీతభత్యాలు సొంతం చేసుకునే వీలుంది. బీపీవో జాబ్స్ కూడా బీకాం అభ్యరులకు లభిస్తాయి.



## బ్యాంకింగ్

ఇంటర్మీడియెట్‌లో సీఈసీ పూర్తి చేసిన అభ్యర్థులు పలు బ్యాంకులు క్లరికల్ పోస్టులకోసం నిర్వహిస్తున్న ప్రవేశ

పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీజనింగ్, మ్యాథమెటికల్ ఎబిలిటీలపై కొంచెం పట్టు ఉండి ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం సాధిస్తే బ్యాంకింగ్ రంగంలో మంచి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. బీకాం పూర్తయ్యాక... డిగ్రీ అర్హతగా ఎస్‌బీఐతోపాటు ఆయా ప్రభుత్వ, ప్రయివేట్ రంగ బ్యాంకుల ప్రొబేషనరీ ఆఫీసర్స్ నియామకాల కోసం నిర్వహించే పరీక్షలకు హాజరు కావచ్చు.

### క్లరికల్

కేవలం ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఎస్‌బీఐ వంటి ప్రభుత్వ రంగ బ్యాంక్‌లో క్లరికల్ ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. సీఈసీ విద్యార్థులు కొద్దిగా శ్రమిస్తే... సునాయాసంగా క్లరికల్ పోస్టును ఖాయం చేసుకోవచ్చు. ఈ పరీక్ష సాధారణంగా 200 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, మార్కెటింగ్ ఆప్టిట్యూడ్ అండ్ కంప్యూటర్ నాలెడ్జ్ తదితర అంశాలుంటాయి.

### స్టాక్ మార్కెట్ జాబ్స్

కామర్స్ నేపథ్యంతో ఫైనాన్షియల్ మార్కెట్స్, సెక్యూరిటీస్ మార్కెట్స్‌పై సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేయడం ద్వారా స్టాక్ మార్కెట్‌లో మంచి ఉద్యోగావకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఈ రంగంలో స్టాక్ మార్కెట్ నిపుణుల అవసరం రోజురోజుకూ పెరుగుతోంది.

### సివిల్స్, గ్రూప్స్

కామర్స్ అభ్యర్థులు పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే పోటీ పరీక్షలకు కూడా హాజరు కావచ్చు. బీకాం పూర్తయ్యాక సివిల్స్, గ్రూప్స్ రాసి.. ప్రభుత్వ రంగంలో ఉన్నత ఉద్యోగాలను కైవసం చేసుకోవచ్చు.

## కామర్స్.. కావాల్సిన స్కిల్స్

కామర్స్ విద్యార్థులు నేటి కార్పొరేట్ ప్రపంచంలో దూసుకుపోవాలంటే... ముందునుంచే కొన్ని స్కిల్స్‌ను డవలప్ చేసుకోవాలి. అవి..

**ప్రాబ్లం అనాలిసిస్ అండ్ రీజనింగ్:**

- సమస్యను విశ్లేషణాత్మక కోణంలో చూడటం అలవరచుకోవాలి. ఆ సమస్య పరిష్కారానికి అసరమైన వ్యూహాత్మక ప్రత్యామ్నాయాలు గుర్తించాలి.
- కొత్త విషయాలను నేర్చుకోవడంపై ఆసక్తి ఉండాలి. దాంతోపాటు క్రిటికల్ థింకింగ్ చేయగలిగే మేథో సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవాలి.
- థియరీని ప్రాక్టీస్‌తో అనుసంధానించగలిగే స్కిల్స్ అవసరం.

**రాయడం.. మాట్లాడటం:**

- క్లిష్టమైన అంశాలను అత్యంత సులభంగా వివరించగలిగే స్కిల్స్ పెంపొందించుకోవాలి.
- టెక్నికల్ రిపోర్ట్స్‌ను తక్కువ పదాలతో పొందికగా రాయగలగాలి.

**సమాచార సేకరణ:**

- సూక్ష్మమైన విషయాలను సైతం వదలకుండా గణాంకాలతో సహా సమగ్రంగా సమాచారాన్ని సేకరించే నైపుణ్యాలుండాలి.
- ఒక అంశంపై లోతుగా పరిశోధన చేయడంతోపాటు, దాన్ని విశ్లేషించగలిగే స్కిల్స్ పెంపొందించుకోవాలి.
- విధానాలను, లక్ష్యాలను తిరిగి పరిశీలించుకోవాలి.

**ఆర్గనైజేషనల్ స్కిల్స్:**

- టీంలో పనిచేయగలిగే సరళత్వం.
- నిర్ణీత సమయంలోపు పని పూర్తిచేయడం.
- కచ్చితమైన డేటాను టేబుల్స్ రూపంలో ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకొని పెట్టుకోవడం.

# హయ్యర్ ఎడ్యుకేషన్

బీకాం పూర్తి చేసినవారికి వివిధ రకాల కోర్సులు ఆహ్వానం పలుకుతున్నాయి. పీజీలో ఎంకాం కోర్సును చేయవచ్చు. సంప్రదాయ ఎంకాంతోపాటు పలు యూనివర్సిటీలు జాబ్ ఓరియెంటెడ్ ఎంకాం కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా జాబ్ మార్కెట్‌లో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

**ఎంకాం:**

బీకాం తర్వాత సంప్రదాయ ఎంకాం కోర్సును పూర్తి చేయొచ్చు. ఎంకాంలో ఫైనాన్స్, బ్యాంకింగ్, అకౌంటింగ్, టాక్సేషన్ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడానికి వీలుంది. మన రాష్ట్రంలోని యూనివర్సిటీలు పీజీ ఎంట్రెన్స్ పరీక్షల ద్వారా ఎంకాంలో అడ్మిషన్లు కల్పిస్తున్నాయి.

**జాబ్ ఓరియెంటెడ్ ఎంకాం:**

జాబ్ మార్కెట్‌లో కొత్త పోకడల నేపథ్యంలో... కొన్ని యూనివర్సిటీలు ఎంకాంలో వినూత్న కోర్సులను అందిస్తున్నాయి. ఎంకాం కార్పొరేట్ సెక్రటరీషిప్ ఆంధ్రా యూనివర్సిటీ; ఎంకాం ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌ను ఉస్మానియా యూనివర్సి టీ; ఎంకాం ఫైనాన్స్ అండ్ కంట్రోల్ కోర్సును ఉస్మానియా యూనివర్సిటీ; ఎంకాం ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ కోర్సును ఆంధ్రా యూనివర్సిటీ; మాస్టర్ ఆఫ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ కోర్సును ఎస్‌వీ యూనివర్సిటీ ఆఫర్ చేస్తున్నాయి. ద్రవిడియన్ విశ్వవిద్యాలయం (కుప్పం) ఐదేళ్ల ఎంకాం (కంప్యూటర్స్) ఇంటిగ్రేటెడ్ కోర్సును అందిస్తోంది.

**ఎమ్మెస్సీ ఫైనాన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్:**

భారతియార్ వర్సిటీ అందించే ఈ కోర్సుకు కామర్స్ గ్రాడ్యుయేట్లు అర్హులు.

**వివరాలకు:** www.bu.ac.in

**మాస్టర్ ఆఫ్ ఫైనాన్స్ కంట్రోల్:**

మధురై కామరాజ్ వర్సిటీ ఈ కోర్సును అందిస్తోంది.

**విద్యార్హత:** డిగ్రీ.

వెబ్‌సైట్: www.mkuniversity.org

**ఎంబీఏ:**

బీకాం అభ్యర్థులు ఎంబీఏ చేస్తే... మేనేజ్‌మెంట్ రంగంలో అద్భుతంగా రాణించొచ్చు. కామన్ అడ్మిషన్ టెస్ట్.. క్యాట్‌తో దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లలో ప్రవేశం పొందొచ్చు. మన రాష్ట్రంలో ఎంబీఏ చేసేందుకు ఐసెట్‌లో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

**అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ.

**సీఈసీతో లా:**

లా.. ఇప్పుడు విద్యార్థుల క్రేజీ కోర్సుగా మారుతోంది. బహుముఖ అవకాశాలు కల్పిస్తుండటం.. మన దగ్గర అంత ర్జాతీయ స్థాయి ప్రమాణాలతో.. నేషనల్ 'లా' స్కూల్, నల్సార్ వంటి లా స్కూల్స్ ఏర్పాటవడం అందుకు ప్రధాన కారణాలు. ప్రవేశ పరీక్షల ద్వారా 'లా' కోర్సులో అడ్మిషన్ పొందాల్సి ఉంటుది. మన రాష్ట్రంలో లాసెట్ ద్వారా అడ్మిషన్ కల్పిస్తారు. జాతీయ స్థాయిలోని ప్రముఖ 11 'లా' స్కూల్స్‌లో కామన్ లా అడ్మి షన్ టెస్ట్ (సీఎల్ఏటీ-క్లాట్) ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు!!

**అర్హత:** 10+2 , తత్సమాన పరీక్షలో 50 శాతం మార్కులు

**పరీక్షా విధానం:** పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 200 బిట్లు ఉంటాయి.

**సమయం:** రెండు గంటలు.

**సబ్జెక్టులు:** ఇంగ్లిష్-40 మార్కులు, జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్-50 మార్కులు, మ్యాథమెటిక్స్-20 మార్కులు, లీగల్ ఆప్టిట్యూడ్-40 మార్కులు, లాజికల్ రీజనింగ్-50 మార్కులు.

వెబ్‌సైట్: www.clat.ac.in

# బీకామ్ పూర్తయ్యాక...

## టాప్ కామర్స్ కాలేజీలు

- **శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ), ఢిల్లీ**
- **లయోలా కాలేజీ, చెన్నై**
- **సెయింట్ జేవియర్ కాలేజ్, కోల్‌కతా**
- **ప్రెసిడెన్సీ కాలేజ్, చెన్నై**
- **సింబాయసిస్ సొసైటీస్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, పూణె**
- **సెయింట్ జోసెఫ్స్ కాలేజ్, బెంగళూరు**
- **బీఎం కాలేజ్ ఆఫ్ కామర్స్, పుణె**
- **సెయింట్ జేవియర్ కాలేజీ, ముంబయి**

**రాష్ట్రంలో పేరున్న కాలేజీలు..**

- **బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్,**

- **నిజాం కాలేజీ, హైదరాబాద్**
- **యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీలు**

## జాబ్ గ్యారెంటీ ప్రొఫెషనల్ కోర్సులు

ఇంజనీరింగ్, మెడిసిన్, కంప్యూటర్ కోర్సులకు దీటుగా సత్వర ఉద్యోగానికి ధీమా ఇచ్చే కోర్సులు... సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎస్. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే ఏ సంస్థకైనా చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ), కాస్ట్ అకౌంటెంటు(ఐసీడబూల్యే), కంపెనీ సెక్రటరీల(సీఎస్) సేవలు తప్పనిసరి. కంపెనీల్లో ఆయా విభాగాల్లో ఈ నిపుణులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఇంటర్‌లో సీఈసీ పూర్తి చేసిన విద్యార్థులు బీకామ్‌తోపాటు పలు జాబ్ గ్యారెంటీ ప్రొఫెషనల్ కోర్సులను పూర్తి చేయొచ్చు. ఇంటర్‌లో చదివిన గ్రూప్‌తో నిమిత్తం లేకుండా ఎవరైనా ఈ కోర్సుల్లో చేరే వీలున్నప్పటికీ.. కామర్స్ విద్యార్థులకు ఇవి సౌలభ్యంగా ఉంటాయి..

### చార్టెర్డ్ అకౌంటెంట్

| ఉన్నత విద్య | ఉద్యోగాలు | పోటీ పరీక్షలు | ప్రొఫెషనల్ కోర్సులు |
|---|---|---|---|
| • ఎంకాం<br>• ఇంటిగ్రేటెడ్ ఎంకాం<br>• బిజినెస్ ఎకనామిక్స్<br>• ఫైనాన్స్ కంట్రోల్ కోర్సు<br>• ఎంఏ ఎకనామిక్స్<br>• ఎంఏ ఆపరేషనల్ రీసెర్చ్<br>• స్టాటిస్టిక్స్<br>• మాస్టర్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)<br>• హోటల్ మేనేజ్‌మెంట్<br>• మల్టీమీడియా, యానిమేషన్<br>• కంప్యూటర్ కోర్సులు | • ఎగ్జిక్యూటివ్స్<br>• అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్<br>• బుక్ కీపర్స్<br>• స్టాక్ మార్కెట్<br>• ఇన్సూరెన్స్<br>• బ్యాంక్ జాబ్స్<br>• సివిల్ సర్వీసెస్.<br>• ఏపీపీఎస్సీ గ్రూప్స్<br>• బీపీఓ<br>• కేపీవో<br>• సేల్స్ అండ్ మార్కెటింగ్<br>• మ్యూచువల్ ఫండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ | • సివిల్ సర్వీసెస్<br>• ఏపీపీఎస్సీ గ్రూప్స్<br>• బ్యాంకింగ్<br>• ఎస్ఎస్‌బీ/ఎయిర్ ఫోర్స్<br><br>• లైఫ్ ఇన్సూరెన్స్<br>• కంబైన్డ్ డిఫెన్స్‌సర్వీసెస్ | • ఐసీడబ్ల్యూఏ<br>• చార్టర్డ్ అకౌంటెంట్<br>• ఫైనాన్షియల్ అనలిస్ట్<br>• లా<br>• కంపెనీ సెక్రటరీ<br>• సీఎఫ్ఏ<br>• ఎంసీఏ<br>• మాస్ కమ్యూనికేషన్స్<br>• జర్నలిజం<br>• బీఈడీ<br>• ఫారిన్ ట్రేడ్<br>• ఫారిన్ లాంగ్వేజెస్<br>• పబ్లిక్ రిలేషన్స్ |

చార్టడ్ అకౌంటెన్సీ... సర్టిఫికెట్ కోర్సుకు ఇంటర్‌తోనే పునాది వేసుకోవచ్చు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) నిర్వహించే ఈ కోర్సులో మొత్తం మూడు దశలు ఉంటాయి.. అవి

1. కామన్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (సీపీటీ),
2. ఇంటిగ్రేటెడ్ ప్రొఫెషనల్ కాంపిటెన్సీ కోర్సు (ఐపీసీసీ),
3. అసిస్టెంట్‌షిప్ (ఫైనల్ కోర్సు).

**కామన్ ప్రొఫిషియన్సీ టెస్ట్:** ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు పూర్తయ్యాక సీపీటీ పరీక్ష రాయడానికి అర్హత లభిస్తుంది. ఈ పరీక్ష రాసేందుకు విద్యార్థులు మొదట తమ పేరు నమోదు చేసుకోవాలి. సీపీటీ పరీక్షలు ఏటా జూన్, డిసెంబర్‌లలో ఉంటాయి. మొత్తం రెండు విభాగాలుగా.. నాలుగు సబ్జెక్ట్‌లలో 200 మార్కులకు సీపీటీ జరుగుతుంది.

**ఇంటిగ్రేటెడ్ ప్రొఫెషనల్ కాంపిటెన్సీ కోర్సు (ఐపీసీసీ):** సీపీటీ ఉత్తీర్ణులైనవారు ఇంటిగ్రేటెడ్ ప్రొఫెషనల్ కాంపిటెన్స్ కోర్సుకు పేరు నమోదు చేసుకోవచ్చు. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2 ఉంటాయి. ఒక గ్రూప్ పాసైనా చాలు.

**అసిస్టెంట్‌షిప్:** ఇది ఫైనల్ దశ. ఐపీసీసీ పూర్తయ్యాక మూడేళ్ల ఆర్టికల్ అసిస్టెంట్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. చార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర ఆర్టికల్‌షిప్ చేయాలి. రెండున్నర సంవత్సరాల తర్వాత ఫైనల్ పరీక్షలు రాసి అర్హత పొందాలి. మిగతా ఆరునెలల కాలంలో ఆర్టికల్‌షిప్‌కూడా పూర్తి చేసుకొని.. సీఏగా ఏదైనా కంపెనీలో చేరొచ్చు. సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకోవచ్చు.

**కెరీర్ స్కోప్:** ఆడిటర్లుగా, టాక్స్ కన్సల్టెంట్లుగా, ఫైనాన్షియల్ కన్సల్టెంట్లుగా, పని చేయొచ్చు. బ్యాంకింగ్, ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లలో కన్సల్టెన్సీలుగా వ్యవహరించవచ్చు. మన రాష్ట్రంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో... ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా శాఖలు ఉన్నాయి. ఆ బ్రాంచ్‌లలో సీపీటీ కోసం పేరు నమోదు చేసుకోవచ్చు. వివరాలకు..

**వెబ్‌సైట్:** www.icai.org చూడొచ్చు.

## ఐసీడబ్ల్యూఏఐ

సీఈసీ విద్యార్థులకు అద్భుత కెరీర్‌ను అందించే కోర్సు... ఐసీడబ్ల్యూఏఐ! ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీడబ్ల్యూఏఐ) దేశంలో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ నిపుణులను తయారు చేసే క్రమంలో అభ్యర్థులకు శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో పని చేస్తోంది. ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్ మూడు స్థాయిల్లో ఐసీడబ్ల్యూఏ కోర్సు ఉంటుంది. ఫౌండేషన్ కోర్సుకు అర్హత ఇంటర్. ఫౌండేషన్ కోర్సులో నాలుగు పేపర్లు ఉంటాయి.

**రెండో దశలో...** ఇంటర్మీడియెట్ లెవల్‌కు డిగ్రీ లేదా, ఫౌండేషన్ కోర్సు పూర్తి చేసుండాలి. ఈ లెవల్‌లో గ్రూప్-1, గ్రూప్-2 పేపర్లు ఉంటాయి. ఇక ఫైనల్ లెవల్లో చేరాలంటే.. ఇంటర్మీడియెట్ లెవల్ పాసవ్వాలి. ఫైనల్లో 8 పేపర్లతోపాటు 5,000 పదాల వ్యాసం, 100 గంటల కంప్యూటర్ శిక్షణ, 15 రోజులు మాడ్యులర్ శిక్షణ, ఆరు మాసాల ఆడిట్ అండ్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ పూర్తి చేయాలి.

**కెరీర్ స్కోప్:** దశాబ్దం క్రితం వరకూ కాస్ట్ అకౌంటెన్సీ ఉత్తీర్ణులకు మైనింగ్, సిమెంట్, జ్యూట్ వంటి ప్రొడక్షన్ యూనిట్లు మాత్రమే కెరీర్ అవెన్యూస్‌గా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. సర్వీస్ సెక్టార్, సాఫ్ట్‌వేర్ రంగం, ఎఫ్ఎంసీజీ... ఇలా ప్రతిచోటా ఐసీడబ్ల్యూఏ అభ్యర్థులకు అవకాశాలు ఆహ్వానం పలుకుతున్నాయి. అర్హత, శిక్షణ, నైపుణ్యం, అనుభ వం గల కాస్ట్ అకౌంటెంట్లకు ఎంతో డిమాండ్ ఉంది. ఫైనాన్స్ డైరెక్టర్, ఫైనాన్షియల్ కంట్రోలర్, చీఫ్ అకౌంటెంట్, కాస్ట్ కంట్రోలర్, మార్కెటింగ్ మేనేజర్, చీఫ్ ఇంటర్నల్ ఆడిటర్ స్థాయికి ఎదగొచ్చు. సొంత వ్యాపారాలు కూడా నిర్వహించవచ్చు.

**పరీక్ష:** ఏటా రెండు సార్లు జూన్, డిసెంబర్‌లలో నిర్వహిస్తారు.

**దరఖాస్తు వెల :** రూ. 200 పోస్టల్ ట్యూషన్ ఫీజు (స్టడీ మెటీరియల్‌తో): రూ.7,000 మౌఖిక శిక్షణ ఫీజు (స్టడీ మెటీరియ ల్‌తో) : రూ.11,000

**వెబ్‌సైట్:** www.icwai.org

హైదరాబాద్ చాప్టర్

**ఈ-మెయిల్:** hyderabad @icwai.org

# కంపెనీ సెక్రటరీ(సీఎస్) కోర్సు

కంపెనీల్లో కీలకమైన హోదాల్లో కంపెనీ సెక్రటరీ (సీఎస్) ఒకటి. ఆ ఉద్యోగం పొందాలంటే... కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తి చేయాలి. ఇంటర్ నుంచే ఆ దిశగా పయనించే మార్గముంది. ఇంటర్ పూర్తయ్యాక ఫౌండేషన్ కోర్సులో చేరొచ్చు. ఫౌండేషన్ కోర్సు లేదా డిగ్రీ పాసైతే... కంపెనీ సెక్రటరీ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో చేరడానికి అర్హత లభిస్తుంది. ఆ తర్వాత ప్రొఫెషనల్ ప్రోగ్రామ్.. తర్వాత ఫైనల్‌గా ప్రి-మెంబర్‌షిప్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని.. సీఎస్ మెంబర్‌షిప్‌కు అర్హత సాధించవచ్చు. ఈ కోర్సు పరీక్షలు ప్రతి ఏటా డిసెంబర్, జూన్‌లలో జరుగుతాయి. మార్చి 31లోపు నమోదు చేసుకుంటే.. డిసెంబర్‌లో జరిగే పరీక్షలు రాయడానికి వీలుంటుంది. సెప్టెంబర్ 30లోపు నమోదు చేసుకుంటే తర్వాతి ఏడాది జూన్‌లో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతి లభిస్తుంది. మన రాష్ట్రంలోని విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవడానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా చాప్టర్‌లలో సంప్రదించాలి. మన రాష్ట్రంలో హైదరాబాద్, విశాఖపట్నంలలో చాప్టర్లు ఉన్నాయి.

**పూర్తి వివరాలకు:** www.icsi.edu వెబ్‌సైట్ చూడండి.